అవినీతిపై అక్షర సమరం

మన అంకుశం

సంచలన సాయంకాలం దినపత్రిక




ఎడిటర్ : మచ్చా రామలింగారెడ్డి | సంపుటి : 5 | సంచిక : 335 | గురువారం 23 అక్టోబర్ 2025 | పేజీలు : 4 | వెల : 3/-






# పెట్రో కెమికల్ కంపెనీలకు ఏపీ అనుకూలం

## అబుదాబీలో పారిశ్రామిక వేత్తలతో సీఎంచంద్రబాబు

## అమరావతిలో జనవరి నుంచి క్వాంటం కంప్యూటింగ్ సేవలు

## విశాఖలో నిర్వహించే భాగస్వామ్య సదస్సుకు రావాలని ఆహ్వానం




**(అంకుశం ప్రతినిధి, నంద్యాల, అక్టోబరు 23):**

ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నుంచి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ దిశగా ఏపీ పయనిస్తోందని సీఎం చంద్రబాబు వెల్లడించారు. అబుదాబీ చాంబర్ చైర్మన్ అహ్మద్ జాసిమ్ అల్ జాబీ, జీ 42 సీఈఓ మాన్సూర్ అల్ మాన్సూరీతో గురువారం సీఎం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. రాజధాని అమరావతిలో క్వాంటం కంప్యూటింగ్ సేవలు జనవరి నుంచి అందుబాటులోకి వస్తాయన్న సిఎం. ఏపీ రాజధాని అమరావతి కొత్త అవకాశాలకు, ఇన్నోవేషన్‌కు కేంద్రంగా ఉంటుందని వివరించిన సీఎం. విశాఖలో నవంబర్ 14, 15 తేదీల్లో జరిగే భాగస్వామ్య సదస్సుకు రావాలని సీఎం ఆహ్వానం. రాష్ట్రంలో త్వరలో పర్యటిస్తామని, పెట్టుబడులపై ఆలోచన చేస్తామని చెప్పిన ప్రతినిధులు. అబుదాబి నేషనల్ ఆయిల్ కంపెనీ ప్రతినిధులతోనూ సీఎం భేటీ. భారతదేశంలో తమ వ్యాపారాన్ని విస్తరించేందుకు ఆసక్తి చూపిన ఏడీఎన్ఓసీ. ఆంధ్రప్రదేశ్‌లో ఇంధన రంగంలో ఉన్న పెట్టుబడి అవకాశాలను - మిగతా2లో

## రేపు మరో అల్పపీడనం

### మరో నాలుగు రోజులు రాష్ట్రంలో భారీ వర్షాలు




**(అంకుశం ప్రతినిధి, అమరావతి, అక్టోబర్ 23):**

దక్షిణ అండమాన్ సముద్రం మరియు దాని పరిసర ప్రాం తాలలో ఆగ్నేయ బంగాళాఖా తంలో సముద్ర మట్టానికి సగటు 5.8 కి.మీ ఎత్తులో ఉపరితల ఆవర్తనం విస్తరించి ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. దీని ప్రభావంతో ఆగ్నేయ, తూర్పు మధ్య బంగాళా ఖాతంలో శుక్రవారం మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని పేర్కొంది. ఇది తదుపరి 24 గంటల్లో పశ్చిమ-ఉత్తర పశ్చిమ దిశగా కదు లుతూ మరింత బలపడే అవకాశం ఉందని వెల్లడిం చింది. రాష్ట్రంలో విస్తతంగా వర్షాలు పడుతుందన్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. మరో నాలుగు రోజులు వర్షాలు కొనసాగే అవకాశం ఉందని తెలిపింది.

## క్వాంటమ్ టెక్నాలజీ రీసెర్చ్‌కి సహకారం ఇవ్వండి

### నైపుణ్యాభివృద్ధిలో ఏపీ ప్రభుత్వంలోభాగస్వామ్యం వహించండి

### యూనివర్సిటీ ఆఫ్ మెల్‌బోర్న్‌ను సందర్శించిన సందర్భంగా మంత్రి లోకేష్



**(అంకుశం ప్రతినిధి, ఆస్ట్రేలియా, అక్టోబర్ 23):**

రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్ విశ్వవిద్యాలయం (యూనివర్సిటీ ఆఫ్ మెల్‌బోర్న్)ను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎమ్మా జాన్సన్, డిప్యూటీ వైస్ ఛాన్సలర్ (గ్లోబల్, కల్చర్ అండ్ ఎంగేజ్ మెంట్) ప్రొఫెసర్ మైఖేల్ వెస్లీ, డీన్ ఆఫ్ ఆర్ట్స్ ప్రొఫెసర్ జెన్నీఫర్ బాలింట్, డీన్ ఆఫ్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ మారెక్ టెసార్, డీన్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ ఐటీ ప్రొఫెసర్ అంపలవనపిళ్లై (థాస్) నిర్మలథాస్, డీన్ ఆఫ్ సైన్స్ ప్రొఫెసర్ మోయిరా ఓ'బ్రియన్ తదితర ఎగ్జిక్యూటివ్ లు లోకేష్ కు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా క్వాంటమ్ పరిశోధనలు, ఉపాధ్యాయ శిక్షణపై వర్సిటీ ఉన్నతస్థాయి బందంతో మంత్రి లోకేష్ చర్చించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ ఆఫ్ మెల్‌బోర్న్ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎమ్మా జాన్సన్ మాట్లాడుతూ... 1853లో స్థాపితమైన మెల్‌బోర్న్ విశ్వవిద్యాలయం ఆస్ట్రేలియాలో అగ్రస్థానంలో ఉందని చెప్పారు. క్యూఎస్ ప్రపంచ విశ్వవిద్యాలయ ర్యాంకింగ్స్ 2025లో అంతర్జాతీయంగా 13వ స్థానాన్ని సంపాదించిందని తెలిపారు. ప్రస్తుతం 55వేల మందికి పైగా విద్యార్థులు తమ యూనివర్సిటీలో చదువుతున్నారని అన్నారు. పరిశోధన, విద్యా నాణ్యత, సామాజిక భాగస్వామ్యం రంగాల్లో పేరొందిన తమ విశ్వవిద్యాలయం... ఆవిష్కరణలు, ప్రపంచ - మిగతా2లో

### తీరంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న

## రాష్ట్రాల్లో ఏపీ అగ్రస్థానం

### రాష్ట్ర అభివృద్ధికి తీసుకుంటున్న వినూత్న పథకాలపై నివేదిక ఇవ్వండి


### సీఎస్ విజయానంద్‌తోనీతి ఆయోగ్ సీఈవో బివిఆర్ సుబ్రహ్మణ్యం

**(అంకుశం ప్రతినిధి, అమరావతి, అక్టోబర్ 23):**



పూర్వోదయ పథకం, విశాఖపట్నం గ్రోత్ హబ్ పై గురువారం ఎపి సచివాలయంలో నీతి ఆయోగ్ సిఇఓ బివిఆర్ సుబ్రహ్మణ్యం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ తో సమావేశమై - మిగతా2లో

## కుండపోత వర్షం.. ప్రాణం నష్టం లేకుండా చూడాలి



### ప్రభావిత జిల్లాలకు అత్యవసర నిధులు మంజూరు

### దుబాయ్ నుంచి సీఎం చంద్రబాబు మంత్రులు, కలెక్టర్లతో సమీక్ష

**(అంకుశం ప్రతినిధి, అమరావతి, అక్టోబరు 23):**

బంగాళాఖాతంలో కొనసాగుతున్న తీవ్ర అల్పపీడన ప్రభావంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భారీ నుండి అతిభారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తం అయింది. రాష్ట్రంలో ఎటు వంటి ప్రాణ, ఆస్తి నష్టం జరుగకుండా ముం దస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేయడం జరిగింది. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించడం జరిగింది. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో పాలు పలువురు మంత్రులు వర్ష ప్రభావిత నెల్లూరు, ప్రకాశం, బాపట్ల, కడప, తిరుపతి జిల్లాల పరిస్థితిపై సంబందిత జిల్లా కలెక్టర్లు, అధికారులతో సమీక్షలు నిర్వహించి అప్రమత్తం - మిగతా2లో

## క్రెడిట్ చోరీలో చంద్రబాబు పీక్.. పర్ఫార్మెన్స్ వీక్



**తాడేపల్లి**

వైఎస్సార్‌సీపీ వేసిన బీజానికి కొనసాగింపే విశాఖ గూగుల్ డాటా సెంటర్ అని వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ క్లారిటీ ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం, అదానీ, కేంద్ర ప్రభుత్వం, సింగపూర్ ప్రభుత్వాల సమిష్టి కృషి ఇది అని చెప్పుకొచ్చారు. 2023లోనే డాటా సెంటర్‌కు శంకుస్థాపన కూడా చేశామని వెల్లడించారు. క్రెడిట్ చోరీలో చంద్రబాబు పీక్.. పర్ఫార్మెన్స్ వీక్ అని సెటైరికల్ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రాన్ని యాడ్ ఏజెన్సీలా నడిపిస్తున్నారు అని ఘాటు విమర్శలు చేశారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ తాడేపల్లిలో మీడియాతో మాట్లాడుతూ..'గూగుల్ డాటా సెంటర్ గురించి మాట్లాడుకుందాం. వారం, పదిరోజులుగా దీని గురించి ఆశ్చర్యం కలిగించే వార్తలు వింటున్నాం. రాష్ట్రంలో పాలనను బాబు గాలికి ఎగిరిపోయింది. ఏదో యాడ్ ఏజెన్సీ నడిపిస్తున్నట్లుగా కనిపిస్తోంది. క్రెడిట్ చోరీలో చంద్రబాబు పీక్.. రాష్ట్ర పరిస్థితి వీక్. వేరే వాళ్లకి - మిగతా2లో

# క్రెడిట్ చోరీలో చంద్రబాబు పీక్.. పర్ఫార్మెన్స్ వీక్

-మొదటిపేజీ తరువాయి

దక్కాల్సిన క్రెడిట్‌ను చోరీ చేయడంలో బాబు ఎప్పుడూ ముందుంటారు. ఏపీలో 2020లో కరోనా టైంలోనే అదానీ డాటా సెంటర్ ఒప్పందానికి బీజం వేశాం. 2023 మే 3న.. ఆ తర్వాత డాటా సెంటర్‌కు శంకుస్థాపన కూడా చేశాం. సింగపూర్ నుంచి సబ్‌సీ కేబుల్ తీసుకొచ్చే ప్రయత్నం చేశాం. దీనికి కొనసాగింపుగానే గూగుల్ డాటా సెంటర్ వచ్చింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం, అదానీ, కేంద్ర ప్రభుత్వం, సింగపూర్ ప్రభుత్వాల సమిష్టి కృషి ఇది. వైఎస్సార్‌సీపీ వేసిన బీజానికి కొనసాగింపే విశాఖ గూగుల్ డాటా సెంటర్ ఇది. వేరేవాళ్లకి క్రెడిట్ ఇవ్వడం చంద్రబాబుకి ఇష్టం ఉండదు.. అందుకే కొన్ని విషయాలు దాస్తున్నారు. అదానీ ప్రాజెక్టు విస్తరణే ఈ గూగుల్ డాటా సెంటర్. వైజాగ్‌లో అదానీ ఇన్‌ఫ్రాకు చెందిన కంపెనీలే గూగుల్ డాటా సెంటర్‌ని నిర్మిస్తున్నాయి. చంద్రబాబు మాటలు కోటలు దాటుతున్నాయని అన్నారు.

**అదానీ గూగుల్ మధ్య వ్యాపార సంబంధాలు..**

ప్రపంచంలోనే అతిపెద్ద గూగుల్ డాటా సెంటర్ వైజాగ్‌కి రాబోతోంది. వైఎస్సార్‌సీపీ వేసిన విత్తనమే ఇది. వేరేవాళ్లకి క్రెడిట్ ఇవ్వడం చంద్రబాబుకి ఇష్టం ఉండదు.. అందుకే కొన్ని విషయాలు దాస్తున్నారు. అదానీ గూగుల్ మధ్య వ్యాపార సంబంధాలున్నాయ్. అదానీ ప్రాజెక్టు విస్తరణే ఈ గూగుల్ డాటా సెంటర్. అదానీ ఇందులో రూ.87 వేల కోట్ల పెట్టుబడి పెడుతున్నారు. వైజాగ్‌లో అదానీ ఇన్‌ఫ్రాకు చెందిన కంపెనీలే గూగుల్ డాటా సెంటర్‌ని నిర్మిస్తున్నాయి. ఇందుకు సంబంధించి.. ఐటీ సెక్రటరీ భాస్కర్‌కు గూగుల్ ప్రతినిధి లేఖ కూడా రాశారు. చంద్రబాబు కనీసం అదానీకి కృతజ్ఞతలు కూడా చెప్పలేదు. వైఎస్సార్‌సీపీకి ఆ ఘనత దక్కుతుందనే.. బాబు ఆ పని చేయడం లేదు' అని తెలిపారు.

**ఎఫిషియన్సీలో చంద్రబాబు వీక్.. క్రెడిట్ చోరీలో పీక్..**

గూగుల్ డేటా సెంటర్‌ను నిర్మించేది అదానీనే. జగన్ సర్కార్ వల్లే డేటా సెంటర్ వచ్చిందని చెప్పలేకపోయారు.క్రెడిట్ ఇవ్వడం చంద్రబాబుకు ఇష్టం లేదు. బాబును చూసి గూగుల్ వచ్చినట్టుగా బిల్డప్ ఇస్తున్నారు. డేటా సెంటర్‌తో ఉద్యోగాలు పెద్దగా రావు. కానీ, ఎకో సిస్టమ్ బిల్డ్ అవుతుంది. భవిష్యత్‌లో పెద్ద మార్పులకు డేటా సెంటర్ కీలకం. డేటా సెంటర్‌తో పెద్దగా ఉద్యోగాలు రావు కాబట్టి.. ఐటీ పార్క్, రిక్రేయేషన్, స్కిల్ సెంటర్ పెట్టాలని ఆలోచన చేశాం. 25వేల మందికి ఉద్యోగాలు కూడా ఇవ్వాలని ఒప్పందం కూడా చేశాం. ఎఫిషియన్సీలో చంద్రబాబు వీక్.. క్రెడిట్ చోరీలో పీక్' అని సెటైర్లు వేశారు.

# డేంజర్ జోన్‌లో ఢిల్లీ ప్రజలు

**న్యూఢిల్లీ:** ఢిల్లీలో ప్రమాదకర స్థాయి వాయు కాలుష్యం కొనసాగుతోంది. దీపావళి తర్వాత రోజురోజుకీ గాలి నాణ్యత పడిపోతోంది. తాజాగా ఢిల్లీ ఆనంద్ విహార్ ప్రాంతంలో ప్రమాదకర స్థాయికి 429 పాయింట్లకు కాలుష్యం చేరింది. క్లౌడ్ సీడింగ్ ద్వారా కృత్రిమ వర్షాలు కురిపించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. ఇది ఇలాగే కొనసాగితే ప్రజలు క్యాన్సర్ వ్యాధి బారిన పడే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఇక, కాలుష్య కారక గాలి పీల్చడం వల్ల ఢిల్లీలో సగటున ప్రతి మనిషి రోజుకి 9 సిగరెట్లు తాగినట్లు అవుతుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. వారానికి 63 సిగరెట్లు, నెలకి 270 సిగరెట్లు తాగుతున్నట్లు వెల్లడించారు. ఇది ఇలాగే కొనసాగితే ప్రజలు క్యాన్సర్ వ్యాధి బారిన పడే ప్రమాదం ఉందని వైద్యులు తెలిపారు. గత మూడు రోజులుగా తారాస్థాయికి వాయు కాలుష్యం చేరి దేశ రాజధాని గ్యాస్ ఛాంబర్‌గా మారిపోయింది. గాలి పీల్చుకునేందుకు ఢిల్లీ వాసులు ఇబ్బందులు పడుతున్నారు. మాస్క్ తప్పనిసరిగా ధరించాలని, అనవసరంగా బయట తిరగవద్దని వైద్యుల సూచనలు చేశారు. ఎయిర్ ప్యూరిఫైయర్ తప్పనిసరిగా వినియోగించాలన్నారు. కాగా, దీపావళి, పంట వ్యర్థాలు కాల్చివేత వల్ల వాయు కాలుష్యం భారీగా పెరిగింది. ఇదిలా ఉండగా.. ఢిల్లీని చుట్టుముట్టిన వాయు కాలుష్యంపై బీజేపీ సమాధానం చెప్పాలని కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ ఎంపీ అభిషేక్ మనుసింఘ్వీ డిమాండ్ చేశారు. ఢిల్లీ వాసులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్న వాయు కాలుష్యం కారణంగా ప్రజలు పడే ఇబ్బందులు అంతాఇంతా కాదని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. " గత మూడ్రోజులుగా దేశ రాజధానిలో గాలి మసిబారిపోయింది. దీనిని పీల్చిన ప్రజల ఊపిరితిత్తులు పొగచూరి నల్లగా మారుతున్నాయి. ఇంత జరుగుతున్నా ఢిల్లీలో బీజేపీ ప్రభుత్వ జవాబుదారీతనం వీసమెత్తయినా కంటికి కనిపించట్లేదు. పండగల వేళ బీజేపీ నేతలు చేసే జ్ఞానబోధనలు ఎవరికీ అక్కర్లేదు. ప్రజలు హాయిగా స్వచ్ఛమైన గాలి పీల్చగలిగేలా చేస్తామంటూ బాధ్యత తీసుకునే బాధ్యతాయుత ప్రభుత్వం కావాలి. ఢిల్లీ పొరుగు రాష్ట్రాలు కాలుష్యంతో అతలాకుతలమవుతున్నా బీజేపీ చర్యలు తీసుకోకపోవడం దారుణం" అని మనుసింఘ్వీ తన సామాజిక మాధ్యమ 'ఎక్స్' ఖాతాలో ఒక పోస్ట్ పెట్టారు. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి గణాంకాల ప్రకారం బుధవారం ఉదయం ఢిల్లీలోని పలు ప్రాంతాల్లో వాయు నాణ్యత సూచీ(ఏక్యూఐ) 'చాలా అధ్వానం'గా నమోదైన నేపథ్యంలో మనుసింఘ్వీ స్పందించారు.




# మలేసియాలో ట్రంప్ - మోదీ భేటీ లేనట్లే..

మలేసియాలో ఈ నెల ఆసియాన్ సదస్సు జరగనున్న విషయం తెలిసిందే. కౌలాలంపూర్‌లో అక్టోబరు 26 నుంచి 28 వరకు జరగనున్న ఈ సదస్సుకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ హాజరుకావడం లేదు. ఈ విషయాన్ని ప్రధాని స్వయంగా ప్రకటించారు. ఈ సమ్మిట్‌లో వర్చువల్‌గా పాల్గొననున్నట్లు తెలిపారు. ఆసియాన్-భారత్ సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింతగా బలోపేతం చేయడానికి ఎదురుచూస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. ఈ సదస్సు నేపథ్యంలో మలేషియాతోపాటూ కంబోడియాలో కూడా ప్రధాని పర్యటించాలని తొలుత భావించారు. అయితే, తాజాగా ఆయన ఈ సదస్సుకు వెళ్లకపోవడంతో.. కంబోడియా పర్యటన కూడా వాయిదా పడింది. ఈ సమ్మిట్‌కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సహా అనేక దేశాల నాయకులు హాజరుకానున్నారు. ప్రధాని మోదీ గైర్హాజరు నేపథ్యంలో ట్రంప్ - మోదీ భేటీ ఈసారి కూడా లేనట్లే. ఈ ఆసియాన్‌లో మలేసియా, ఫిలిప్పీన్స్, సింగపూర్, థాయ్‌లాండ్, వియత్నాం, మయన్మార్ వంటి 10 దేశాలు సభ్యదేశాలుగా ఉన్నాయి. ఈ సమ్మిట్‌లో ప్రధాని మోదీకి బదులు విదేశాంగ మంత్రి జైశంకర్ ప్రాతినిధ్యం వహించనున్నట్లు తెలుస్తోంది.



# ట్రంప్ కొత్త వ్యూహం..
# అతిపెద్ద రష్యా చమురు సంస్థలపై అమెరికా ఆంక్షలు!

రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ముగించే విషయంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన ప్రయత్నాలను ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా తాజాగా రష్యాకు చెందిన రెండు అతిపెద్ద చమురు కంపెనీలైన రోస్‌నెఫ్ట్, లుకోయిల్ పై ఈ ఆంక్షలు విధించారు రష్యా అధ్యక్షుడు పుతిన్ ట్రంప్‌ల భేటీ వాయిదా పడిన నేపథ్యంలో ఈ ఘటన చోటుచేసుకుంది. యూఎస్ ట్రెజరీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫారిన్ అసెట్స్ కంట్రోల్ ఆఫీస్ ఓ ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించింది. ఉక్రెయిన్‌తో యుద్ధం ముగించడమే కాకుండా శాంతి ప్రక్రియపై రష్యాకు నిబద్ధత లేకపోవడం వల్లే ఈ ఆంక్షలు విధించినట్లు తెలిపింది. తమ నిర్ణయం ఆ దేశ చమురు రంగంపై ఒత్తిడి పెంచుతుందని, దీనివల్ల రష్యా ఆర్థికవ్యవస్థపై కూడా ప్రభావం పడుతుందని వ్యాఖ్యానించింది. శాశ్వత శాంతి పూర్తిగా రష్యా చర్చలు జరపడానికి రావడంపై ఆధారపడి ఉందని వెల్లడించింది. ట్రంప్ మాట్లాడుతూ.. ఇవి అపారమైన ఆంక్షలన్నారు. అయితే, ఇవి ఎక్కువకాలం ఉండవని, ఈలోపు యుద్ధ సమస్య పరిష్కారమవుతుందని వ్యాఖ్యానించారు. ఈ చర్యకు ఇదే సరైన సమయం అని తాను భావిస్తున్నట్లు కూడా తెలిపారు. ఈ ఆంక్షలతో యుద్ధం కారణంగా జరుగుతున్న హత్యలను ఆపడంతో పాటు తక్షణ కాల్పుల విరమణకు సమయం ఆసన్నమైందని ట్రెజరీ కార్యదర్శి స్కాట్ బెసెంట్ పేర్కొన్నారు. అమెరికా మిత్ర దేశాలు తమతో కలవాలని, ఆంక్షలకు కట్టుబడి ఉండాలని పిలుపునిచ్చారు. ట్రెజరీ ప్రకారం.. ఈ చర్య రష్యా తన సైనిక కార్యకలాపాలకు నిధులు సమకూర్చే సామర్థ్యం తగ్గుతుంది. దీంతో పాటు దాని




చమురు ఆధారిత ఆర్థిక వ్యవస్థ బలహీన పడుతుంది. ఇక, ఈయూ కూడా రష్యాపై ఒత్తిడి తెచ్చేందుకు గాను 19 ఆంక్షల ప్యాకేజీకి ఆమోదం తెలిపింది. రష్యా ఎల్ఎన్‌జీపై నిషేధం విధించడం కూడా ఇందులో ఉంది.

ఇదిలాఉండగా.. రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు చేసే విషయంపై ట్రంప్ మరోసారి మాట్లాడారు. ఈ ఏడాది చివరి నాటికి భారత్ రష్యా నుంచి చమురు దిగుమతులను భారీగా తగ్గిస్తుందన్నారు. తగ్గింపు క్రమంగా ఉంటుందని, ఇది మంచి చర్య అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ మేరకు భారత్ నుంచి తనకు హామీ వచ్చిందని కూడా తెలిపారు. ఈ విషయంపై ట్రంప్ గత కొన్ని రోజులుగా సొంత ప్రకటనలు చేస్తూ వస్తుండగా.. భారత్ వాటిని ఖండిస్తుంది. అయినా, అగ్రరాజ్యం అధ్యక్షుడు మళ్లీ మళ్లీ ఇలాంటి ప్రకటనలే చేయడం గమనార్హం.

## పెట్రో కెమికల్ కంపెనీలకు ఏపీ అనుకూలం

-మొదటిపేజీ తరువాయి

వివరించిన సీఎం. దక్షిణాసియాకు చేరువగా సుదీర్ఘ తీర ప్రాంతం కలిగిన వ్యూహాత్మక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని తెలిపిన ముఖ్యమంత్రి. పెట్రో కెమికల్ కంపెనీలు కార్యకలాపాలు నిర్వహించేందుకు అవకాశం ఉందని వివరించిన సీఎం. ౖ అనంతరం అబుదాబీలోని జీ 42 సీఈవో మనుకుమార్ జైన్, ఏడీఐసీ గ్లోబల్ హెడ్ లలిత్ అగర్వాల్, ఐహెచ్‌సీ సీఈవో అజయ్ భాటియా, డబ్ల్యుఐవో బ్యాంక్ సీఈవో జయేష్ పాటిల్.. పాలిగాన్ మార్ఫిక్ సీఈవో జయంతి కనాని, ట్రక్కర్ సీఈవో గౌరవ్ బిశ్వాస్, పాలసీ బజార్ గ్రూప్ సీఈవో యశిష్ దహియా, ఇన్స్యూరెన్స్ మార్కెట్ సీఈవో అవినాష్.. ఇన్సార్ఫ్ సీఈవో అజార్ ఇక్బాల్, జీఐఐ సీఈవో పంకజ్ గుప్తా, నూన్ సీఈవో ఫరాజ్ ఖలీద్, ఇన్సెప్షన్ సీఈవో ఆశీష్ కోషి తదితర పారిశ్రామిక వేత్తలతో నెట్వర్క్ లంచ్‌లో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు.

## కుండపోత వర్షం..
## ప్రాణం నష్టం లేకుండా చూడాలి

-మొదటిపేజీ తరువాయి

చేయడం జరిగింది. రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దుబాయ్ నుంచి అధికారులతో మాట్లాడి పరిస్థితిని సమీక్షించారు. వర్ష ప్రభావిత నెల్లూరు, ప్రకాశం, బాపట్ల, కడప, తిరుపతి జిల్లాల పరిస్థితిపై సీఎస్ మరియు ఆర్టీజీ అధికారుల నుంచి సమాచారం సేకరించి, యంత్రాంగం అప్రమత్తంగా ఉండి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభావిత ప్రాంతాలకు ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బందాలను పంపించాలని సూచిస్తూ, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా రెవెన్యూ, డిజాస్టర్, పోలీస్, ఇరిగేషన్, మున్సిపల్, ఆర్ అండ్ బి, విద్యుత్ శాఖలు సమన్వయంతో పనిచేయాలని సీఎం సూచించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, కాలువలు మరియు చెరువుల గట్లు బలహీనంగా ఉన్న చోట్ల పటిష్ట పరచాలని ఆదేశించారు. అంతేకాక, అంటువ్యాధులు వ్యాపించకుండా వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని కూడా ముఖ్యమంత్రి సూచించారు. ఎడతెరిపి లేని వర్షాల నేపథ్యంలో మంత్రి పి. నారాయణ మున్సిపల్ కమిషనర్లను అప్రమత్తం చేశారు. మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్, డైరెక్టర్ సంపత్ కుమార్, ఉన్నతాధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహిస్తూ, వర్షాల కారణంగా ప్రజలకు ఇబ్బందులు కాకుండా అన్ని అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్ర హెూం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత విజయవాడలో మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా పిడుగులతో కూడిన వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అప్రమత్తమైందని తెలిపారు.

## క్వాంటమ్ టెక్నాలజీ రీసెర్చ్‌కి సహకారం ఇవ్వండి

-మొదటిపేజీ తరువాయి

భాగస్వామ్యాలు, స్థిరత్వం, సామాజిక ప్రభావం వంటి అంశాలపై దష్టిసారించిందని తెలిపారు. మెల్‌బోర్న్ నగరంలో ఐదు క్యాంపస్ లతో కార్యకలాపాలు నిర్వహిస్తున్నాం. అంతర్జాతీయ సహకారంపై కేంద్రీకతమైన ప్రపంచ వ్యూహంతో తాము ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, విశ్వవిద్యాలయాలతో కలిసి కత్రిమ మేధస్సు, సైబర్ సెక్యూరిటీ, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ వంటి అధునాతన సాంకేతికలపై స్థిరమైన పద్ధతుల్లో నైపుణ్యాభివద్ధి కార్యక్రమాలను రూపొందించాలని కోరారు. క్వాంటమ్ టెక్నాలజీ రీసెర్చ్ కు సహకరించాలని అన్నారు. ఆంధ్రప్రదేశ్ లో రెన్యువబుల్ ఎనర్జీ, వ్యవసాయం, ఆరోగ్య రంగాల్లో సంయుక్త పరిశోధనా కేంద్రాలను ఏర్పాటు చేసి రాష్ట్రాభివద్ధి లక్ష్యాలను సాధించడంలో భాగస్వామ్యం వహించండి. స్థానిక సంస్థలను భాగస్వాములుగా చేసి డిజిటల్ హెల్త్ సొల్యూషన్స్, టెలీ మెడిసిన్ ద్వారా ఆరోగ్య సేవలను మెరుగుపర్చేందుకు సహకారం అందించాలని మంత్రి లోకేష్ విజ్ఞప్తి చేశారు.

## తీరంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో ఏపీ అగ్రస్థానం

-మొదటిపేజీ తరువాయి

చర్చించారు. ఈసందర్భంగా నీతి ఆయోగ్ సిఇఓ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ దేశ తూర్పు తీరంలో అత్యంత వేగంగా అభివద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో ఆంధ్రపదేశ్ ముందుందని పూర్వోదయ పథకం ద్వారా తీరప్రాంతంలో మరింత అభివద్ధికి అవకాశాలు ఉన్నాయని తెలిపారు.ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ లో పలు ఓడరేవులు ఉన్నప్పటికీ ప్రత్యేకంగా ఒక కంటైనర్ మెగాపోర్టు ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉందని ఆదిశగా తగిన ప్రయత్నాలు చేయాల్సిన అవసరం ఉందని ప్రభుత్వానికి సూచించారు.అదే విధంగా రానున్న చీఫ్ సెక్రటరీల సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమగ్రాభివద్ధికి తీసుకుంటున్న వినూత్న పథకాలపై ప్రత్యేక ప్రజెంటేషన్ ఇచ్చేందుకు వీలుగా తగిన నివేదికను సిద్ధం చేసుకోవాలని సిఎస్ విజయానంద్ కు ఆయన సూచించారు.అనంతరం విశాఖపట్నం,అమరావతి,తిరుపతి గ్రోత్ కారిడార్ల ఏర్పాటు తద్వారా జరిగే అభివద్ధి ప్రయోజనాలపై ఆయన చర్చించారు. అనంతరం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ మాట్లాడుతూ విశాఖపట్నం గ్రోత్ హబ్ పనులు వేగవంతం చేసేందుకు ప్రత్యేకంగా ఒక అధికారిని ఇన్చార్జిగా నియమించడం జరుగుతుందని చెప్పారు.రాష్ట్రంలో వివిధ ప్రాజెక్టులను వేగవంతంగా ముందుకు తీసుకువెళ్ళడం తోపాటు అనేక నూతన ప్రాజెక్టులు, పరిశ్రమలు ఏర్పాటు అయ్యేలా ప్రభుత్వం పెద్దఎత్తున ప్రయత్నాలు చేస్తోందని వివరించారు.కేంద్రం నుండి వివిధ ప్రాజెక్టులు,పథకాలకు సకాలంలో తగిన నిధులు మంజూరు అయ్యేలా కషి చేయడం జరుగుతోందని కేంద్రం నుండి తగిన నిధులు మంజూరు అయ్యేలా నీతి ఆయోగ్ సిఫార్సు చేయాలని సిఎస్ విజయానంద్ నీతి ఆయోగ్ సిఇఓ సుబ్రహ్మణ్యంకు విజ్ఞప్తి చేశారు. కాగా పూర్వోదయ అనేది దేశ తూర్పుతీరంలోని ఆంద్రప్రదేశ్,ఒడిస్సా,పశ్చిమ బెంగాల్, ఝూర?ండ్,బీహార్ ఐదు రాష్ట్రాల్లో కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన ఒక వినూత్న పథకం.ఇది సాంస్కతిక వారసత్వం మరియు సహజ వనరులను ఉపయోగించుకోవడం,కొత్త మౌలిక సదుపాయాలను సష్టించడం,ఉపాధిని సష్టించడం మరియు స్థిరమైన ఆర్థికవద్ధిని ప్రోత్సహించడం ద్వారా తూర్పు భారతదేశాన్ని జాతీయ పురోగతికి కీలకమైన చోదకంగా మార్చాలనే లక్ష్యంతో పూర్వోదయ పథకాన్ని చేపట్టడం జరిగింది.దీనిద్వారా పెద్దఎత్తున రహదారులు వంతెనలు,విమానాశ్రయాలు,విద్యుత్ ప్లాంట్లు వంటి ముఖ్యమైన మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల్లో పెట్టుబడులు పెట్టడం జరుగుతుంది.ఈ ప్రాజెక్టులు ప్రాంతీయ కనెక్టివిటీని మెరుగుపరచడానికి,పారిశ్రామికాభివద్ధికి మరింత దోహద చేస్తాయి.అంతేగాక పూర్వోదయ విద్యా మరియు నైపుణ్య%-%అభివద్ధి సంస్థలను బలోపేతం చేయడానికి ప్రాధాన్యత ఇస్తుంది.అర్హత కలిగిన శ్రామిక శక్తిని సిద్ధం చేయడానికి ఐఐటి ఇతర నైపుణ్య%-%శిక్షణా కేంద్రాల్లో సామర్థ్య విస్తరణ కూడా దోహదపడుతుంది. పూర్వోదయ పథకం వ్యవసాయం, అనుబంధ రంగాల్లో మెరుగైన మౌలిక సదుపాయాలు,ఉద్యోగ అవకాశాలు,నైపుణ్యాభివద్ధిని పెంపొందిస్తుంది.అంతేగాక పారిశ్రామిక కారిడార్ల ఏర్పాటుకు మద్దతు ఇవ్వడం తోపాటు పెట్టుబడులను ప్రోత్సహిస్తూ వ్యవసాయం, మత్స్య సంపద వంటి రంగాల్లో విలువ జోడింపును ప్రోత్సహిస్తుంది.సమతుల్య ప్రాంతీయ అభివద్ధి సమ్మిళిత వద్ధిని ప్రోత్సహిస్తుంది మరియు భారతదేశం అంతటా ఆర్థిక అసమానతలను తగ్గిస్తుంది.మెరుగైన కనెక్టివిటీ మరియు పారిశ్రామిక సామర్థ్యం తూర్పు రాష్ట్రాలను ఎగుమతులు మరియు స్థిరమైన ఆర్థిక కార్యకలాపాలకు కేంద్రాలుగా ఉంచుతాయి. ఈసమావేశంలో నీతి ఆయోగ్ అదనపు సీఈవో పార్థసారధి రెడ్డి,రాష్ట్ర ఆర్థిక,ప్రణాళికల శాఖల ముఖ్య కార్యదర్శి పియూష్ కుమార్,విద్యాశాఖ కార్యదర్శి కె.శశిధర్, ఆర్థికశాఖ కార్యదర్శి వినయ్ చంద్,ప్రణాళికాశాక జెఎస్ అనంత శంకర్,నైపుణ్యాభివద్ధి సంస్థ ఎండి జి.గణేశ్ కుమార్ పాల్గొన్నారు

# 25 ఏళ్ల సర్వీసున్న కానిస్టేబుళ్లను అప్‌గ్రేడ్ చేస్తాం







– రాష్ట్ర రక్షణాదళవ ఆవిర్భావ దినోత్సవంలో డీజీ తివిక్రమ వర్మ, ఐజీ రామ్‌రెడ్డి

**(అంకుశం ప్రత్యేక ప్రతినిధి, గుంటూరు, అక్టోబర్ 23):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రత్యేక రక్షణ దళం (ఏపీఎస్‌పీఎఫ్) ఆవిర్భావ దినోత్సవం గురువారం ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో డైరెక్టర్ జనరల్ త్రివిక్రమ వర్మ, ఇన్స్పెక్టర్ జనరల్ బి.వి.రామ్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత హాజరు కావాల్సి ఉండగా కొన్ని అనివార కారణములు ఆమె రాలేకపోయారు. ఆమె స్థానంలో హోం శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ కుమార్ విశ్వజిత్ హాజరై గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా హోం శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ మాట్లాడుతూ.. ఏపీఎస్‌పీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం జరుపుకోవడం ఎంతో ఘనంగా ఉన్నదని, ఈ కార్యక్రమాన్ని గొప్పగా నిర్వహించినటువంటి డా. త్రివిక్రమ్ వర్మ ఈఎ గారిని మరియు ఇతర అధికారులను సిబ్బందిని ప్రసంశించారు. అలాగే, ఎస్‌పీఎఫ్ ట్రైనింగ్ సెంటర్ నిర్మాణం, రిక్రూట్మెంట్ కొరకు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయని తెలిపారు. 25 సంవత్సరాలు సర్వీస్ పూర్తి చేసుకున్నటువంటి 2000 బ్యాచ్ కానిస్టేబుల్స్ ను అప్‌గ్రేడ్ చేయుటకు ప్రభుత్వ పరిశీలనలో ఉందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ జనరల్ త్రిక్రమ వర్మ మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర విభజన తర్వాత ఆవిర్భావ దినోత్సవ వేడుకలను జరుపుకోవటం ఇది మొదటి సారి అని తెలిపారు. ఈ కార్యక్రమం ఎంతో ఘనంగా నిర్వహించారని, సిబ్బంది అందరికీ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా కతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా 14వ తేదీ నుంచి నిర్వహించిన క్రీడా పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి స్పెషల్ హోమ్ సెక్రటరీ విజయ కుమార్, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ రియాక్టర్ ఇన్%-% చార్జ్ వైస్ ఛాన్సిలర్ శివరాం ప్రసాద్న్, కమాండెంట్ భాషా, అసిస్టెంట్ కమాండెంట్లు తదితరులు పాల్గొన్నారు.

# కార్యకర్తల కష్టం మీద పదవులు పొందిన నాయకులే పార్టీలు మారుతారు-మాజీ ఎమ్మెల్యే సత్తి

- రామవరంలో కోటి సంతకాల ప్రజా ఉద్యమం – రచ్చబండ నిర్వహణ
- మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై ప్రభుత్వ మెడలు వంచుతాం
- ప్రజా ఉద్యమానికి సంతకాల మద్దతు
పేద విద్యార్థుల భవిష్యత్తుకు వైయస్ఆర్‌సీపీ అండ
- పార్టీ గ్రామ కమిటీతో పాటు పలు విభాగాల కమిటీలు నియామకం
- వర్షాన్ని సైతం లెక్కచేయకుండా రచ్చబండ సభకు పెద్ద ఎత్తున హాజరైన గ్రామస్తులు, వైయస్ఆర్‌సీపీ శ్రేణులు





**తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ అక్టోబర్ 23:** ఏ పార్టీలోనైనా కార్యకర్తల కష్టంతో పదవులు పొందిన వారే స్వార్థ రాజకీయాల కోసం పార్టీలు మారుతారు, కార్యకర్తలు మాత్రం మారరని అనపర్తి నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం రామవరం గ్రామంలో స్వర్గీయ సత్తి వీర్రెడ్డి ఇంటి వద్ద జరిగిన కోటి సంతకాల రచ్చబండ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సత్తి సుబ్బిరెడ్డి అధ్యక్షత వహించారు. మొదటగా స్వర్గీయ సత్తి వీర్రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం మండల పార్టీ కన్వీనర్ సత్తి రామకృష్ణారెడ్డి(రాంబాబు) అధ్యక్షతన రచ్చబండ సభ జరిగింది. వర్షం వస్తున్నా లెక్కచేయకుండా రామవరం గ్రామంలో భారీగా హాజరైన నాయకులు, కార్యకర్తలు పార్టీ పట్ల ఉన్న నిబద్ధతకు నిదర్శనం. కార్యకర్తల రెక్కల కష్టం మీద పదవులు పొందిన వారే స్వార్థ రాజకీయాల కోసం పార్టీలు మారుతారు – కార్యకర్తలు మాత్రం కాదు. ఈరోజు రామవరం రచ్చబండ సభ ఆ నిజాన్ని మరోసారి రుజువు చేసిందన్నారు. తాను పోటీ చేసిన ప్రతి ఎన్నికలో రామవరం ప్రజలు తనకు మెజారిటీ ఇచ్చి వెన్నుదన్నుగా నిలిచారని తెలిపారు. నా ఐదేళ్ల పదవీకాలంలో రామవరం గ్రామాన్ని గణనీయంగా అభివృద్ధి చేశాను. మళ్లీ శాసనసభ్యుడిగా అవకాశం ఇస్తే రామవరం గ్రామాన్ని మరింత అభివృద్ధి చేసి ప్రజల విశ్వాసానికి ప్రతిఫలం ఇస్తానన్నారు. రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ మాజీ డైరెక్టర్, మండల పార్టీ కన్వీనర్, సత్తి రామకృష్ణారెడ్డి(రాంబాబు) మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేపట్టిన, చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలను తీవ్రంగా విమర్శించారు. ప్రజల ఆకాంక్షలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న ఈ ప్రభుత్వం రోజురోజుకీ ప్రజా వ్యతిరేకంగా మారుతోంది. వైయస్ఆర్‌సీపీ మాత్రమే ప్రజల హక్కుల కోసం కృషి చేస్తుంది" అని అన్నారు. ఈ కార్యక్రమంలో సబ్బెళ్ళ కృష్ణారెడ్డి (అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, తూర్పుగోదావరి జిల్లా వైయస్ఆర్‌సీపీ అధికార ప్రతినిధి), ఆదాడి చి. సత్యనారాయణ (మాజీ వైస్ చైర్మన్), చింతా సునీల్ రెడ్డి (రాష్ట్ర ఐటీ విభాగం కార్యదర్శి), గుడిమెట్ల వెంకటరెడ్డి (పీహెచ్సీ అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్), నాయకులు లంక పెద్ద సత్యనారాయణ, టేకి బాబురావు, టేకి వీర్రాఘవ, లంక శ్రీను, కర్రి గాంధీ రెడ్డి తదితర వైయస్ఆర్‌సీపీ శ్రేణులు పాల్గొన్నారు.

## పక్కృతి సేద్యం పై రైతులకు అవగాహన కల్పించాలి

– రసాయనికి వినియోగం అధికంగా ఉన్న గ్రామాలను గుర్తించి... ఎరువుల వినియోగాన్ని కట్టడి చేయాలి
– జిల్లా కలెక్టర్ ఏ శ్యాం ప్రసాద్




**అంకుశం ప్రతినిధి పుట్టపర్తి అక్టోబర్ 23:** జిల్లాలో భూమాత రక్షణ మరియు ప్రధాన మంత్రి ధన ధాన్య కృషి యోజన పథకాన్ని పటిష్టంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ఏ శ్యాం ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్ లోని సమావేశపు హాలులో... భూమాత రక్షణ కార్యక్రమం మరియు ప్రధాన మంత్రి ధన ధాన్య కృషి యోజన పథకము (PMDDKY) అమలుపై కలెక్టర్ అధ్యక్షతన జిల్లాస్థాయి కమిటీ సమావేశము నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రకృతి సేద్యం విభాగాన్ని కూడా కమిటీలో చేర్చి ప్రకృతి సేద్యం పద్ధతులను రైతులకు వివరించే ప్రణాళికలను రూపొందించాలని సూచించారు. గ్రామ, మండల, డివిజన్ స్థాయి కమిటీలను వీలైనంత త్వరగా ఏర్పాటు చేసుకొని సమావేశాలను ఏర్పాటు చేసి రైతులకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలోని 100 గ్రామాలలో ఎక్కడ రసాయనిక ఎరువుల వినియోగం అధికంగా ఉందో గుర్తించి.. సరైన పద్ధతులు, సలహాలు రైతులకు సూచించి అధిక ఎరువుల వినియోగాన్ని కట్టడి చేయాలని చెప్పారు. జిల్లా పరిషత్, జిల్లా సహకార, పోలీసు శాఖల అధికారులు సమన్వయం చేసుకొని పక్కా ప్రణాళిక ద్వారా కార్యాచరణను అమలు పరచాలని చెప్పారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి వి. రాము నాయక్ మాట్లాడుతూ... డివిజన్ మరియు గ్రామస్థాయిలో వీలైనంత త్వరగా సమావేశాలు ఏర్పాటు చేసి రైతులనుంచి వచ్చే అభిప్రాయాలను తీసుకొని వెంటనే చర్యలు చేపడతామని కలెక్టరుకు వివరించారు.

ఈ సమావేశంలో వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు, పోలీసు, సహకార కంపెనీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## బెలుగుప్ప, శీర్పి చెరువులకు జీడిపల్లి రిజర్వాయర్ నుండి నీరందించాలి

– : రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు శాఖ మంత్రివర్యులు పయ్యావుల కేశవ్





**అంకుశం న్యూస్ అనంతపురం, అక్టోబర్ 23 :** అనంతపురం జిల్లా ఉరవకొండ నియోజకవర్గం లోని– బెలుగుప్ప, శీర్పి చెరువులకు జీడిపల్లి రిజర్వాయర్ నుండి నీరందించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రివర్యులు పయ్యావుల కేశవ్ ఆదేశించారు. గురువారం ఉరవకొండ నియోజకవర్గం బెలుగుప్ప మండలం శీర్పి చెరువు మరియు బెలుగుప్ప చెరువులకు జీడిపల్లి రిజర్వాయర్ నుండి పంపింగ్ స్టేషన్ 9,10 ద్వారా చెరువులకు నీరు వెళ్లే కాలువను శీర్పి గ్రామం వద్ద అధికారులతో కలిసి మంత్రి పయ్యావుల కేశవ్ పరిశీలించారు.

– ఈ సందర్భంగా మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ జీడిపల్లి రిజర్వాయర్ నుండి పంపింగ్ స్టేషన్ 9,10 ద్వారా బెలుగుప్ప, శీర్పి చెరువులకు నీరందించాలని, తమ ప్రభుత్వం అన్ని చెరువులకు నీరందించేందుకు కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎన్ఎస్ఎస్ గుంతకల్లు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసనాయక్, డిఈ వెంకటరమణ, ఏఈఈ ఏ.సుదర్శన్, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## బాధితులకు అండగా కూటమి ప్రభుత్వం నిలుస్తోంది.. ఎమ్మెల్యే సురేంద్రబాబు

– ఆపన్నులకు అండగా ఉండి సహాయం చేస్తున్న ప్రభుత్వం



**అంకుశం న్యూస్ కళ్యాణదుర్గం అక్టోబర్ 23:** అనంతపురం జిల్లా కళ్యాణ్ దుర్గం నియోజకవర్గంలో వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు ఇటీవలలిఅనారోగ్యంతో బాధపడుతూ స్వంత ఖర్చులతో అప్పులు చేసి మరి ఆసుపత్రులలో చూపించుకుని ఇబ్బందులు పడుతున్న వారికి ఆర్థికంగా అండగా నిలబడటం కోసం కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని వారికి సకాలంలో ముఖ్యమంత్రి సహాయనిధి అందించి కొండంత అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు పేర్కొన్నారు. .ప్రకావేదిక నందు నేడు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు, సీనియర్ నాయకులు, మండల పార్టీ అధ్యక్షులు, స్థానిక నాయకులతో కలసి 22 మంది బాధితులకు 10.32 లక్షల రూపాయలు ముఖ్యమంత్రి సహాయనిది చెక్కులను పంపిణీ చేశారు..ఈ సందర్భంగా ఎమ్మెల్యే అమిలినేని మాట్లాడుతూ అప్పులు చేసి ఆసుపత్రులలో చూపించుకుని ఇబ్బందులు పడుతున్న బాధితులకు కూటమి ప్రభుత్వం అండగా ఉండాలనే లక్ష్యంతో ఎప్పటికప్పుడు ముఖ్యమంత్రి సహాయనిదిని ప్రభుత్వం అందిస్తోందని చెప్పారు..

## నిండు కుండలా బద్వేల్ పెద్ద చెరువు

– నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న చెరువులను నింపడానికి ప్రణాళికలు
– నేల రాలే ప్రతి నీటి బొట్టును ఒడిచి పట్టుకుంటాం
–బద్వేల్ పెద్ద చెరువును పరిశీలించిన విజయమ్మ





**పోరుమామిళ్ల /బద్వేల్,అక్టోబర్ 23(అంకుశం పత్రిక):** రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలతో బ్రహ్మ సాగర్ రిజర్వాయర్ నుంచి వచ్చే నీటితో నిండిన బద్వేల్ పెద్ద చెరువును గురువారం బద్వేల్ మాజీ ఎమ్మెల్యే విజయమ్మ తెలుగు గంగ ప్రాజెక్ట్ చీఫ్ ఇంజనీర్, ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, తెలుగు గంగ అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... బ్రహ్మ సాగర్ నుండి వచ్చే నీటితో పెద్ద చెరువు నిండుకుండలా ఉండడం సంతోషదాయకమన్నారు. కరువు తాండవించే రాయలసీమలో కూటమి ప్రభుత్వ పాలనలో ప్రాజెక్టులన్నీ నీటితో పరవళ్ళు తొక్కుతున్నాయన్నారు. గొలుసు కట్టు చెరువైన పెద్ద చెరువు నుంచి నియోజకవర్గంలోని చెరువుల అన్నింటికి నీటిని నింపడంపై అధికారులతో చర్చించారు. పెద్ద చెరువు నుంచి విడుదల చేసే నీటితో అన్ని చెరువులు నిండాలని, ఏదైనా చెరువుకు మరమ్మత్తులు అవసరమైతే జిల్లా కలెక్టర్ అనుమతులు తీసుకోవాలని అధికారులకు సూచించారు. నేల రాలే ప్రతి నీటి బొట్టును ఒడిచిపట్టి రైతుల పంటలకు ప్రాణం పోయాలన్నారు విజయమ్మ.

## జగన్‌ను కలిసిన పార్టీ యువజన విభాగం నియోజకవర్గ కన్వీనర్‌శ్రీకృష్ణ



**కోనసీమ జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ అక్టోబర్ 23:** వైఎస్సార్సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని బుధవారం తాడేపల్లిలోని నివాసంలో పార్టీ యువజన విభాగం నియోజకవర్గ కన్వీనర్ చోడే శ్రీకృష్ణ మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్సీ, నియోజకవర్గ కన్వీనర్ తోట త్రిమూర్తులు సారథ్యంలో నియోజకవర్గంలో యూత్ కమిటీల ఏర్పాటు, పార్టీ బలోపేతానికి చేస్తున్న కృషిని వివరించారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణను జగన్ అభినందించారు. మాజీ ఎమ్మెల్యే బిక్కిన కృష్ణార్జున చౌదరి, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాజాబాబుల యోగక్షేమాలను గురించి జగన్ అడిగి తెలుసుకున్నట్లు శ్రీకృష్ణ తెలిపారు.

## కబడ్డీ జిల్లాస్థాయి పోటీలకు మహర్షి విద్యార్థులు




**పోరుమామిళ్ల, అక్టోబర్ 23(అంకుశం పత్రిక):** బద్వేల్ లో జరిగిన ఎస్ జి ఎఫ్ –14, –17 కబడ్డీ క్రీడాపోటీల్లో పోరుమామిళ్ల మహర్షి పాఠశాల విద్యార్థులు విజేతలుగా నిలిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక కావడం జరిగిందని మహర్షి పాఠశాల కరస్పాండెంట్ గురు మోహన్, భాస్కర్ లు తెలిపారు. జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులు ధరణి, సుస్మిత, ఖాసీమ్, సుహాసిని, శ్వేతలను పాఠశాల యాజమాన్యంతో బాటు పీఈటీలు షరీఫ్, శైలజలు అభినందించి, జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. క్రీడాకారులకు అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామన్నారు.

## కలుషితమైన నీటితో అనారోగ్యం

– ఆహార పదార్థాలు వేడిగా ఉండేలా చూసుకోవాలి
– చెరువుల్లో, నదుల్లో ఎవరైనా గల్లంతయితే పోలీసులకు ఫోన్ చేయాలి
–డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి



**.పోరుమామిళ్ల,అక్టోబర్ 23(అంకుశం పత్రిక):** కడప జిల్లా వ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని మాజీ ఆప్కాస్ బోర్డు మెంబర్ డాక్టర్ కళ్యాణ చక్రవర్తి పేర్కొన్నారు. కడప జిల్లాకు వాతావరణ శాఖ రెడ్ అలెర్ట్ ప్రకటించిన కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. ప్రజలు వాగులు వంకలు దాటేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని అన్నారు. అనవసరంగా ప్రయాణాలు చేయకూడదని తెలియజేశారు. వర్షంలో అంటువ్యాధులు పెరిగే అవకాశం ఉందని ఇంటి చుట్టూ నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. తాగునీటిని కాల్చి చల్లార్చి తాగడం మంచిది అని, వ్యక్తిగత శుభ్రత పాటించాలి అన్నారు. ఆహార పదార్థాలు వేడిగా ఉండేలాగా చూసుకోవాలన్నారు. చెరువుల దగ్గర ఎవరైనా గల్లంతయితే పోలీస్ కంట్రోల్ రూమ్ కి కాల్ చేసి సహాయం అడగాలని డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి తెలిపారు.

## అఖిల భారత అయ్యప్ప భక్తుల సంఘం. ధర్మవరం మండల అధ్యక్షుడిగా బైసాని హరి కుమార్.



**అంకుశం న్యూస్ ధర్మవరం అక్టోబర్ 23:** అఖిల భారత అయ్యప్ప భక్తుల సంఘం.(%ూదీూదీూ%) సత్య సాయి జిల్లా ధర్మవరం మండల శాఖ అధ్యక్షుడిగా బైసాని హరి కుమార్ ను నియమించినట్లు అఖిల భారత అయ్యప్ప భక్తుల సంఘం జాతీయ అధ్యక్షుడు అడ్వకేట్ వాండ్రాసి పెంచలయ్య పేర్కొన్నారు. ఈ సందర్భంగా ధర్మవరం మండల శాఖ అధ్యక్షుడిగా ఎన్నికైన బైసాని హరి కుమార్ మాట్లాడుతూ నిత్యం అయ్యప్ప భక్తుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అఖిల భారత అయ్యప్ప భక్తుల సంఘం బలోపేతానికి కృషి చేస్తానన్నారు తనను మండల శాఖ అధ్యక్షుడిగా నియమించిన జాతీయ అధ్యక్షుడు అడ్వకేట్ వాండ్రాసి పెంచలయ్య కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# అనంతలో 'వైఎస్ఆర్‌సీపీ ప్రజా ఉద్యమం' పోస్టర్లు విడుదల

- ఈనెల 28న అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో ర్యాలీలు
- అందరూ భాగస్వాములు కావాలని అనంత వెంకటరామిరెడ్డి





**అంకుశం న్యూస్ అనంతపురం, అక్టోబర్ 23 :**ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ప్రైవేటు కర్ణకు నిరసనగా మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాలు ప్రకారం ఈ నెల 28వ తారీఖున అన్ని నియోజకవర్గ కేంద్రాలలో భారీ ర్యాలీలు నిర్వహిస్తున్నామని ప్రతి ఒక్కరూ పాల్గొనాలని వైఎస్సార్సీపి అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకట్రాంరెడ్డి కోరారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా "వైఎస్ఆర్‌సీపీ ప్రజా ఉద్యమం'పై రూపొందించిన పోస్టర్‌ను అనంతపురంలోని వైసీపీ జిల్లా కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, వైసీపీ నాయకులతో కలిసి ఆవిష్కరించిన వైసీపీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ..ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ విజయవంతంగా కొనసాగుతోంది. ఈనెల 28వ తేదీన అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో ర్యాలీలు చేపడుతున్నాం. అన్నారు. ఈ ప్రజా ఉద్యమంలో మేధావులు, ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు పాల్గొనాలని కోరుతున్నాం. కూటమి ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయింది. ఎక్కడ చూసినా అక్రమాలు, దౌర్జన్యాలు రాజ్యమేలుతున్నాయి. అని అనంత వెంకట్రామిరెడ్డి ఆరోపించారుప్రజాధనం, ప్రభుత్వ ఆస్తులను నిలువు దోపిడీ చేయడం కోసమే పీపీపీ పేరుతో చంద్రబాబు భారీ స్కాంకు తెరతీస్తున్నారు. ప్రభుత్వ ఆధ్వర్యంలోనే మెడికల్ కళాశాలలు ఉంచాలన్న డిమాండ్‌తో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో ప్రజా ఉద్యమం చేస్తున్నాం. రాష్ట్ర వ్యాప్తంగా కోటి సంతకాల సేకరణ ఓ యజ్ఞంలా కొనసాగుతోంది. ఇంకా ఉధృతం చేయడంలో భాగంగా అక్టోబర్ 28వ తేదీన అన్ని అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో ర్యాలీలు నిర్వహించి ఆర్డీఓలు, తహశీల్దార్లకు వినతిపత్రాలు అందజేస్తాం. అని అనంత వెంకట్రాంరెడ్డిఅన్నారుఅనంతపురంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు ర్యాలీ కొనసాగుతుంది. మేధావులు, ప్రజా సంఘాలు, విద్యార్థులు, యువత, రాజకీయ పార్టీలు అందరూ భాగస్వాములు కావాలని కోరుతున్నాం. అని అనంత వెంకట్రాంరెడ్డి అన్నారు

## తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి దోచుకోవడం వల్లనే పనులు ఆగిపోయాయి

- 20రోజుల్లో రాప్తాడు రైల్వే ఓవర్ బ్రిడ్జి పై రాకపోకలు ప్రారంభిస్తాం
- ఎమ్మెల్యే పరిటాల సునీత
- రాప్తాడు రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులను పరిశీలించిన సునీత
- పనులు వేగవంతంగా చేయాలని ఆదేశం





**అంకుశం న్యూస్ అనంతపురం అక్టోబర్ 23:** గత ప్రభుత్వంలో మాజీ శాసనసభ్యులు తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి కమీషన్లు కాంట్రాక్టర్లకు బెదిరింపులు వంటి సంఘటనలతోదోచుకోవాలన్న ప్రయత్నంతో కాంట్రాక్టర్లను అన్ని వర్గాల ప్రజలను భయభ్రాంతులకు గురి చేయడంతో నియోజకవర్గంలో చాలా పనులు ఆగిపోయాయని రాప్తాడు శాసనసభ్యురాలు పరిటాల సునీత అన్నారుగత 8ఏళ్లుగా వాహనదారులకు తీవ్ర ఇబ్బందికరంగా మారిన రాప్తాడు రైల్వే ఓవర్ బ్రిడ్జి మీద.. 20 రోజుల్లో రాకపోకలు ప్రారంభిస్తామని.. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత తెలిపారు. గురువారం జాతీయ రహదారి అధికారులు, కాంట్రాక్టర్లు, టిడిపి నాయకులతో కలిసి ఆమె రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులను పరిశీలించారు. ప్రస్తుతం పనులు ఎంతవరకు వచ్చాయి.. ఎప్పటిలోగా రాకపోకలు ప్రారంభిస్తారన్న అంశాల గురించి అధికారులను అడిగి ఆరా తీశారు. పనులను వేగవంతంగా చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పరిటాల సునీత మాట్లాడుతూ 2017లో అప్పటి తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ హయాంలో ఈ బ్రిడ్జి మంజూరైందన్నారు. మొత్తం 74 కోట్ల రూపాయల నిధులు కూడా విడుదల చేసినట్లు చెప్పారు. అయితే పాత కాంట్రాక్టర్ 49 కోట్ల రూపాయల వరకు పనులు చేసి ఆ తర్వాత ఆలస్యం చేశారన్నారు. గత వైసిపి ప్రభుత్వంలో దీని గురించి ఏమాత్రం పట్టించుకోకపోవడం వల్ల వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. ప్రకాష్ రెడ్డికి ప్రజల సొమ్ము దోచుకునే దానిపై ఉన్న శ్రద్ధ ప్రజా సమస్యలు పరిష్కరించడం మీద లేదన్నారు. నిత్యం తమను విమర్శించే ప్రకాష్ రెడ్డి గత ఐదేళ్లలో ఈ బ్రిడ్జి పనులు ఎందుకు పూర్తి చేయించలేకపోయారని నిలదీశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉన్నత స్థాయిలో దీని గురించి అనేకసార్లు మాట్లాడి తిరిగి పనులు ప్రారంభించామన్నారు. ప్రస్తుతం పనులు వేగవంతంగా జరుగుతున్నాయని..2026 మే నెలలోపు ఈ పనులు పూర్తిస్థాయిలో జరుగుతాయన్నారు. అయితే మరో 20 రోజుల్లో ఈ బ్రిడ్జి మీదుగా రాకపోకలు కూడా ప్రారంభించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. దాదాపు 8 ఏళ్ల సమస్యకు మరో 20 రోజుల్లో పరిష్కారం లభిస్తుందని ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు....

# రెజ్లింగ్ ఫ్రీస్టైల్, గ్రీకో రోమన్ ఓవరాల్ చాంపియన్ నెల్లూరు

- క్రీడలు మరియు ఆటలు విద్యార్థుల ఎంతో ఉపయోగం
- రాష్ట్ర ఎంఈఓల సంఘం అధ్యక్షుడు వెంకట రత్నం



**అంకుశం స్పోర్ట్స్ ప్రతినిధి విజయవాడ అక్టోబర్ 23:** విజయవాడ రూరల్ మండలం నున్నలోని అశోక ఫంక్షన్ హాల్‌లో గురువారం ముగిసిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) అండర్-19 బాలుర అంతర్ జిల్లాల కుస్తీ ఛాంపియన్‌షిప్‌లో శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు (ఎస్‌పీఎస్ఆర్ నెల్లూరు) జిల్లా ఫ్రీస్టైల్ మరియు గ్రీకో-రోమన్ విభాగాలలో రెండు ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌లను గెలుచుకుంది. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (ఎస్‌జీఎఫ్ఏపీ), సమగ్ర శిక్ష (ఎస్ఎస్), ఎన్‌టీఆర్ జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నున్న జిల్లా పరిషత్ హైస్కూల్ మూడు రోజుల పాటు ఈ టోర్నమెంట్‌ను నిర్వహించింది.నెల్లూరు జిల్లా క్రీడాకారులు ఈ టోర్నమెంట్ అంతటా అద్భుతమైన ఆధిపత్యాన్ని ప్రదర్శించారు. ఫ్రీస్టైల్ విభాగంలో, ఆ జట్టు నాలుగు బంగారు పతకాలు, రెండు రజత పతకాలను గెలుచుకోవడం ద్వారా 26 పాయింట్లు సాధించగా, గ్రీకో-రోమన్ విభాగంలో మూడు బంగారు పతకాలు, మూడు కాంస్య పతకాలతో 18 పాయింట్లు సాధించి, రెండు ఫార్మాట్లలో రెండు ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌లను కైవసం చేసుకుంది.

ఈ సందర్భంగా జరిగిన ముగింపు కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ మండల విద్యా అధికారుల సంఘం (ఏపీఎంఈఓఏ) అధ్యక్షుడు, విజయవాడ రూరల్ ఎంఈఓ ఎ. వెంకట రత్నం ముఖ్య అతిథిగా హాజరై వ్యక్తిగత విజేతలకు పతకాలను ప్రదానం చేయడంతోపాటు నెల్లూరు జిల్లా బృందానికి ఓవరాల్ ఛాంపియన్‌షిప్ ట్రోఫీలను అందజేశారు. ఈ సందర్భంగా వెంకట రత్నం మాట్లాడుతూ, క్రీడలు, ఆటలు విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి, వారిని ఆరోగ్యంగా, క్రమశిక్షణతో, ప్రేరణతో ఉంచడానికి గణనీయంగా దోహదపడతాయని నొక్కి చెప్పారు. విజయవాడ రూరల్ మండల పరిధిలోని కీలక గ్రామాలలో ఒకటైన నున్నలో ప్రతిష్టాత్మక రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ టోర్నమెంట్‌ను విజయవంతంగా నిర్వహించినందుకు నిర్వాహకులను ఆయన ప్రశంసించారు. పానిపట్‌లో జరగనున్న అండర్-19 స్కూల్ గేమ్స్ నేషనల్స్‌లో బంగారు పతకాల కోసం కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ జట్టుకు ఎంపికైన రెజ్లర్లను ఆయన ప్రోత్సహించారు. అలాగే, మ్యాచ్‌ల్లో ఓడిపోయిన వారు విజేతల అనుభవాల నుండి నేర్చుకుని భవిష్యత్ ఈవెంట్లలో మెరుగైన ప్రదర్శన ఇవ్వాలని ఆయన సూచించారు. జడ్పీహెచ్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సూరపనేని రవి ప్రసాద్ ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించగా, ఎస్ఎంసీ చైర్మన్ జీ కుమార్, ఏపీ రెజ్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు జీ భూషణం, ఎస్‌జీఎఫ్ పరిశీలకుడు చిటికిన రమేష్, టెక్నికల్ ఇన్‌చార్జ్ పీ ఆనంద్, జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి టీ శ్రీ లత, ఫిజికల్ డైరెక్టర్లు టీ విజయ వర్మ, ఎంవీ సత్య ప్రసాద్, ఎస్ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## పోలీసు రక్షక్ ప్రైమరీ స్కూల్ పిల్లలకు డిజిటల్ ప్లేట్స్ అందించిన జిల్లా ఎస్పీ పి జగదీష్

పిల్లలతో ప్రత్యేకంగా మాట్లాడిన జిల్లా ఎస్పీ



**అంకుశం క్రైమ్ న్యూస్ అనంతపురం అక్టోబర్ 23:** అనంతపురం జిల్లా అనంతపురం నగరంలో గలఅనంతపురం పోలీస్ రక్షక్ ప్రైమరీ స్కూలు విద్యార్థులకు వితరణగా డిజిటల్ స్లేట్స్, నోట్ బుక్స్, పెన్సిల్స్, హ్యాండ్ వాష్ కిట్స్ ను జిల్లా ఎస్పీ పి.జగదీష్ అందజేశారు డిస్కవర్ అనంతపురం, ఏ జీ ఎస్ ఫౌండేషన్ ద్వారా అందజేశారు. డిస్కవర్ అనంతపురం అనిల్ కుమార్, ఏ జి ప్రమీలమ్మలు సహృదయంతో జిల్లా ఎస్పీ చేతుల మీదుగా స్కూలు పిల్లలకు డిజిటల్ స్లేట్స్, నోట్ బుక్స్,పెన్సిల్స్, హ్యాండ్ వాష్ కిట్స్ ను స్పాన్సర్ చేశారుగురువారం అందజేశారుజిల్లా ఎస్పీ జగదీష్ పిల్లలతో కాసేపు ముచ్చటించి వారి విద్యాభ్యాసంపై అడిగి తెలుసుకుని నాణ్యమైన విద్యనందించాలని సూచించారు. డిజిటల్ స్లేట్స్, హ్యాండ్ వాష్ కిట్స్ వల్ల పిల్లలకు ఆరోగ్యం, చదువుపరంగా ఎంతో ఉపయోగపడతాయని... వీటిని అందజేసిన డిస్కవర్ అనంతపురం అనిల్ కుమార్, ఏ జి ప్రమీలమ్మలకు జిల్లా ఎస్పీ జగదీష్ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈకార్యక్రమంలో ఏ ఆర్ అదనపు ఎస్పీ షేక్ ఇలియాస్ బాషా, ఏ.ఆర్. డీఎస్పీ నీలకంఠేశ్వర రెడ్డి, ఆర్ఐ అడ్మిన్ పవన్ కుమార్ , జిల్లా పోలీస్ అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్ నాథ్, ఆర్.ఎస్.ఐలు బాబ్‌జాన్, రమేష్ నాయక్ , స్కూల్ అధ్యాపక బృందం పాల్గొన్నారు.

## అనపర్తిలో జన్మభూమి రైలు హాల్ట్ చిరకాల కోరిక తీర్చిన ఎం పీపురందేశ్వరి , ఎమ్మెల్యే నల్లమిల్లి

ఫలించిన ఎంపీ పురందేశ్వరి, ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కృషి



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ అక్టోబర్ 23:** విశాఖపట్నం-లింగంపల్లి జన్మభూమి ఎక్స్ ప్రెస్ (12805/12806) స్టేషన్లో హాల్ట్ ఇవ్వాలని రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి తో కలిసి ఎమ్మెల్యే నల్లమిల్లి చేసిన కృషి ఫలించింది. ఈమేరకు రైల్వే బోర్డు ఆమోదం తెలిపింది. అతి త్వరలోనే ఈ నిర్ణయం అమల్లోకి వస్తుందని రైల్వే అధికారుల నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. గతంలో టిడిపి ప్రయత్నాలు, తరువాత వచ్చిన వైఎస్ఆర్ పార్టీలో ఎవరికి తగ్గ ప్రయత్నాలు వారు చేసినా కూటమి లో బాగంగా అనపర్తి నియోజకవర్గం బీజేపీ కి కేటాయించడం ఆ నియోజకవర్గంలో బలమైన నేత నల్లమిల్లి రామకృష్ణారెడ్డికి ఆసీటు కేటాయించడం జరిగింది. ఇక్కడ ప్రధాన సమస్యల్లో ఇకా ఇది ఒకటి కావడంతో అప్పటినుండి ఈ సమస్యని చాలెంజ్ గా తీసుకుని ఎం పీ పురందేశ్వరి సహకారం తో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అలుపెరగని పోరాటం చేస్తూ ఈ సమస్య పరిష్కారం చేసి అందరి దృష్టిని తనవైపు తిప్పుకున్నాడు. ఈ డిమాండ్ ఎప్పటి నుండో ఉన్నప్పటికీ కార్యరూపం దాల్చలేదు. అయితే అనపర్తి, పరిసర ప్రాంత ప్రజల నుంచి వస్తున్న విజ్ఞప్తిని పరిగణన లోకి తీసుకుని అనపర్తిలో జన్మభూమి ఎక్స్ ప్రెస్ నిలుపుదల చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎంపీ పురందేశ్వరి రైల్వే అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లడం తో విజయం సాధించారు. ఈ అంశంపై ఈ ఏడాది ఏప్రిల్ 2వ తేదీన, జూలై 25వ తేదీన రైల్వే మంత్రికి లేఖలు కూడా రాసారు. దీంతో అనపర్తిలో జన్మభూమి ఎక్స్ ప్రెస్ హాల్ట్ కి రైల్వే బోర్డునుంచి ఆమోదం తెల్పింది. కాగా మచిలీపట్టణం- విశాఖ పట్నం ఎక్స్ ప్రెస్ (నెం 17219/17220), 2 కడప ఎక్స్ ప్రెస్ (18521/18522) తిరుమల ఎక్స్ ప్రెస్ రైళ్లు కొవ్వూరు స్టేషన్ లో నిలుపుదల చేయాలని ఎంపీ పురందేశ్వరి చేసిన ప్రయత్నానికి రైల్వే బోర్డు ఆమోదం తెలుపుతూ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెల్సిందే. ఈ విషయంలో అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కృషి ఫలించింది అని ఆయా వర్గాల ప్రజలు అభినందించారు.

## ఆస్ట్రేలియాలో మంత్రి నారా లోకేష్ ను కలిసిన ఎమ్మెల్యే దగ్గుపాటి తనయుడు మణిహాస్

ఆస్ట్రేలియా పర్యటనలో భాగంగా మెల్‌బోర్న్ యూనివర్సిటీకి వెళ్లిన నారా లోకేష్



**అంకుశం న్యూస్ అనంతపురం అక్టోబర్ 23:** ఆస్ట్రేలియాలో పర్యటిస్తున్న ఏపీ ఐటి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ను అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తనయుడు దగ్గుపాటి మణిహాస్ కలిశారు. ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్ లోని యూనివర్సిటీ ఆఫ్ మెల్‌బోర్న్ లో మణిహాస్ కెమికల్ ఇంజనీర్ గా మొదటి సంవత్సరం చదువుతున్నారు. మంత్రి లోకేష్ తన పర్యటనలో భాగంగా మెల్‌బోర్న్ యూనివర్సిటీ కి వెళ్లారు. ఈ నేపథ్యంలో ఆయనకు దగ్గుపాటి మణిహాస్ ఘన స్వాగతం పలికారు. ఎలా చదువుతున్నావ్... ఎలా ఉన్నావ్ అంటూ మణిహాస్ ను నారా లోకేష్ ఆప్యాయంగా పలుకరించారు. ఇక్కడ వాతావరణంకి అలవాటు పడ్డావా...చదువు ఎలా సాగుతతోందంటూ ఆరా తీశారు. బాగా చదివి మన రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఈ సందర్భంగా నారా లోకేష్ మణిహాస్ కు సూచించారు. ఆ తర్వాత మెల్‌బోర్న్ యూనివర్సిటీ వీసీ మైఖేల్ వెస్లీ, సీనియర్ అధ్యాపకులతో లోకేష్ భేటీ అయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో నైపుణ్య అభివృద్ధి మరియు ఆవిష్కరణలకు కొత్త మార్గాలను సృష్టించడానికి ఏఐ, సైబర్ సెక్యూరిటీ, ఎల్ఓటి, క్వాంటం రీసెర్చ్‌ల గురించి చర్చించారు. ఈ సందర్భంగా మణిహాస్ మాట్లాడుతూ మంత్రి నారా లోకేష్ ను ఆస్ట్రేలియాలో కలవడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఆయన రాష్ట్ర అభివృద్ధి కోసం పడుతున్న తపన గురించి ఇక్కడ తెలుగు వారే కాకుండా ఆస్ట్రేలియాలో ప్రముఖులు కూడా చర్చించుకుంటున్నారని మణిహాస్ పేర్కొన్నారు.

## అక్రమ మద్యంపైకఠినంగా వ్యవహరించండి


- కూటమి ప్రభుత్వంలో కల్తీ మద్యానికి తావులేదు..
- ఎమ్మెల్యే పరిటాల సునీతలి
- ఎక్సైజ్ సురక్ష యాప్ స్కానర్ కోడ్ ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే సునీత



**అంకుశం న్యూస్ అనంతపురం అక్టోబర్ 23:** అక్రమ మద్యానికైనా కల్తీ మద్యానికైనా కేరాఫ్ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీనే కేరాఫ్ అడ్రెస్ అని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత విమర్శలు చేశారు. అనంతపురంలోని తన క్యాంప్ కార్యాలయంలో ఎక్సైజ్ సురక్ష యాప్ స్కానర్ కోడ్ ను ఆమె ఆవిష్కరించారు. ప్రొహిబిషన్ %౭% ఎక్సైజ్ శాఖ నూతనంగా ప్రారంభించిన ఈ యాప్ ను ప్రజలలోకి తీసుకెళ్లేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా ఎక్సైజ్ అధికారులు ఎమ్మెల్యే పరిటాల సునీత చేతులమీదుగా ఈ యాప్ ఆవిష్కరింపజేశారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే పరిటాల సునీత మాట్లాడుతూ నాణ్యమైన మద్యమే వినియోదారుడికి చేరాలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. కొన్న వెంటనే దుకాణం వద్దే మద్యం చెక్ చేసుకునేందుకు వీలుగా ఈ యాప్‌ను తీసుకువచ్చిందన్నారు. దీని ద్వారా వినియోగదారుడు తాను కొనే మద్యం అసలైందా... లేక నకిలీదా అనే విషయం అక్కడికక్కడే తెలిసిపోతుందన్నారు. యాప్ ద్వారా స్కాన్ చేస్తే చాలు తాను కొన్న లిక్కర్ బాటిల్ వివరాలు తెలుస్తాయన్నారు. ఒక వేళ స్కాన్ చేసినా వివరాలు కనిపించకపోతే అది నకిలీ మద్యంగా భావించవచ్చని.. ఫిర్యాదు చేయకుండానే ఆ వివరాలు ఎక్సైజ్‌శాఖ దృష్టికి వెళ్తాయన్నారు. ప్రభుత్వం కల్తీ మద్యం విషయంలో ఎవర్నీ ఉపేక్షించేది ఉండబోదన్నారు. గత వైసిపి ప్రభుత్వంలో అక్రమ మద్యం ఏరులై పారిందన్నారు. ఎంతోమంది ప్రాణాలు పోవడానికి కారణమయ్యారన్నారు. అందుకే వరుసగా వైసిపి నాయకులు జైల్లోకి కూడా వెళ్తారన్నారు. ఇప్పుడు కల్తీ మద్యం వ్యవహారంలో కూడా వైసిపి నాయకుల పాత్ర ఉన్నట్లు తెలుస్తోందన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం సీరియస్ గా వ్యవహరిస్తుందని.. ఎమ్మెల్యే పరిటాల సునీత స్పష్టం చేశారు....

## పదో తరగతి ఉర్దూ విద్యార్థులకు స్టడీ మెటీరియల్

- నంద్యాలలో ఆవిష్కరించిన మైనారిటీ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్



**(అంకుశం ప్రతినిధి, నంద్యాల, అక్టోబరు 23):** రాష్ట్రవ్యాప్తంగా ఉర్దూ మీడియం లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు మైనారిటీ మంత్రిత్వ శాఖ నేతృత్వంలో స్టడీ మెటీరియల్ ను విడుదల చేశారు. సెంటర్ ఫర్ ఎడ్యుకేషనల్ డెవలప్మెంట్ ఆఫ్ మైనారిటీస్ (సి ఈ డి ఎం ) ఆంధ్రప్రదేశ్ శాఖ రూపొందించిన ఉర్దూ మీడియం పదవ తరగతి స్టడీ మెటీరియల్ ను రాష్ట్ర న్యాయ మైనారిటీ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ గురువారం నంద్యాలలో ఆవిష్కరించారు. సిఈడిఎం సంచాలకుడు (ఎఫ్ఏసి), రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ వీసీ,ఎండి యాకుబ్ భాష అధ్యక్షతన స్టడీ మెటీరియల్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మైనారిటీ మంత్రి ఫరూక్ మాట్లాడుతూ, పదవ తరగతి పాస్ అయితే జీవితం కూడా సగం పాస్ అయినట్లేనని అందువలన ప్రతి ఒక్క విద్యార్థి పదవ తరగతి పాస్ కావాలనే సంకల్పంతో నిష్ఠాతులచే స్టడీ మెటీరియల్ రూపొందించడం జరిగిందని అన్నారు. మైనారిటీలకు ఉన్నత విద్యతో పాటు, యు పి ఎస్ సి, ఏపీపీఎస్సీ, టెట్, నీట్,డీఎస్సీ లాంటి ఉద్యోగ పోటీ పరీక్షలకు ప్రత్యేకంగా శిక్షణ ఇవ్వడం కోసం కూటమి ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ తో కూడిన చర్యలను అమలు చేస్తున్నదని అన్నారు. మైనారిటీ మంత్రిత్వ శాఖ నేతృత్వంలో రాష్ట్రవ్యాప్తంగా సిఈడిఎం కేంద్రాల ద్వారా మైనారిటీ విద్యార్థులకు ఉచిత విద్య,ఉచిత శిక్షణ ఇవ్వడం జరుగుతున్నదని పేర్కొన్నారు. ఉర్దూ విద్యార్థుల కోసం రూపొందించిన స్టడీ మెటీరియల్ ను రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలలో ఉన్న ఉర్దూ పదవ తరగతి విద్యార్థులకు సిఈడియం ద్వారా పంపుతున్నట్లు, అందుకు తగిన ఏర్పాట్లను వేగవంతం చేయాలని సంచాలకుడు యాకూబ్ భాషను మంత్రి ఫరూక్ ఆదేశించారు. నవంబర్ 5వ తేదీ లోపు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలలో ఉన్న ఉర్దూ పదవ తరగతి విద్యార్థులకు పంపిణీ చేస్తామన్నారు.అనంతరం నంద్యాల అసెంబ్లీ పరిధిలో ఉర్దూ మీడియం పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పుస్తకాలను మంత్రి ఫరూక్ చేతుల మీదుగా సిఈడిఎం అధికారులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి జనార్దన్ రెడ్డి, జిల్లా ఉర్దూ పాఠశాలల తనిఖీ అధికారి అస్మద్దీన్, పలువురు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.